హకీంపేటలో భారీగా మోహరించిన పోలీసులు

146 ఎకరాలు.. 300 మంది పోలీసులు

పోలీసు వలయంలో భూ సర్వే.. రైతులు లేకుండానే పట్టాభూముల్లోకి అధికారులు.. భయంతో పొలాలకు రాని అన్నదాతలు

- సీఎం సొంత నియోజకవర్గంలో కర్షకుల కష్టాలు
- భూములు గుంజుకుంటే తామెట్లా బతకాలని ఆవేదన
- ఇప్పటికే అసైన్డ్ భూముల సర్వే పూర్తి

తమకు మీరైనా న్యాయం చేయాలని తహసీల్దార్‌కు చేతులెత్తి వేడుకొంటున్న రైతులు

కొడంగల్, ఫిబ్రవరి 8: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో రైతుల కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. శనివారం పోలీసుల పహరాలో పట్టా భూముల సర్వే నిర్వహించారు. వందలాది మంది పోలీసుల బందోబస్తు నడుమ వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం హకీంపేటలో రెవెన్యూ అధికారులు పట్టా భూముల సర్వే చేపట్టారు. ఇప్పటికే పోలీసుల దౌర్జన్యం, కేసులతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్న దుద్యాల మండలం లగచర్ల, పోలేపల్లి, హకీంపేట గ్రామాల రైతులు పోలీసు వలయంలో సర్వే చేస్తుండటంతో భయంతో పొలాలకు కూడా వెళ్లలేదు. దీంతో రైతులు లేకుండానే పోలీసులు సమక్షంలో అధికారులు సర్వే చేశారు.

భయంతో అటు చిక్కు చూడని రైతులు

కొడంగల్ నియోజకవర్గంలో ప్రభుత్వం తలపెట్టిన ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు సంబంధించి భూ సేకసరణ పనులను అధికారులు వేగవంతం చేశారు. శుక్రవారం వరకు పోలేపల్లి, లగచర్ల, హకీంపేట గ్రామాల పరిధిలోని అసైన్డ్ భూముల సర్వే చేపట్టగా.. శనివారం హకీంపేట పరిధిలో 146 ఎకరాల పట్టా భూముల్లో సర్వే నిర్వహించారు. సుమారు 300 మందికి పైగా పోలీసులు మోహరించడంతో రైతులు అటుదిక్కు చూడలేదు. రైతులు లేకనప్పటికీ దుద్యాల తహసీల్దార్ కిషన్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. హకీంపేట గ్రామ పరిధిలో మొత్తం 114 మంది రైతులకు సంబంధించి 146 ఎకరాల పట్టా భూముల సేకరణ జరగాల్సి ఉండగా, ఇప్పటివరకు 20 మంది రైతులు 40 ఎకరాలను ప్రభుత్వానికి ఇచ్చేందుకు సమ్మతి తెలిపినట్టు తహసీల్దార్ వివరించారు. పట్టా భూములకు ఎంత నష్టపరిహారం చెల్లించాలనే విషయంపై స్పష్టత రాలేదని తెలిపారు. సమ్మతి తెలిపిన రైతుల భూములతో పాటు మిగతా భూముల్లోనూ సర్వే చేపట్టి హద్దులు గుర్తిస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు. పట్టా భూములకు ఎంత నష్టపరిహారం ఇస్తారనేది నిర్ణయించకుండానే సర్వే చేస్తుండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

రైతుల సమ్మతి లేకుండానే

తమ సమ్మతి లేకుండానే సర్వే చేపడుతుండటంపై రైతులు మండిపడుతున్నారు. కష్టపడి సంపాదించిన భూములను ప్రభుత్వానికి ఎందుకివ్వాలని ప్రశ్నిస్తున్నారు. ఈ భూములపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నామని తెలిపారు. భూములు ఇచ్చే ప్రసక్తే లేదని, ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా వెనుకాడబోమని చెబుతున్నారు. ప్రభుత్వ భూములు ఇస్తే ఇబ్బంది ఉండదని, కానీ లక్షల విలువైన భూములను ఇవ్వాలంటే ప్రాణాలు పోయినంత పని అవుతుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

మా భూములు విడిచిపెట్టండి సారూ

కాళ్లు మొక్కుతాం సారూ.. మా భూములు మాకు విడిచిపెట్టండి. ఉన్న దోశడంత భూమిలో మేము, మా ముగ్గురు పిల్లలం బతకాలి. ఈ మట్టిలోనే పుట్టాం.. ఈ మట్టిలోనే కలిసిపోతాం. వ్యవసాయం తప్ప మాకు ఇంకేం తెల్వదు. మా బతుకుల గురించి ఒక్కసారి ఆలోచించండి సీఎం సారూ.

-మంగళి జయమ్మ, మహిళా రైతు,హకీంపేట దుద్యాల మండలం

పుస్తెలమ్మి భూమి కొన్న

ఎన్నో కష్టాలకోర్చి, పుస్తెలమ్మి 7 ఎకరాలు కొన్నాం. నా కొడుకులు కాయకష్టం చేసి పంటలు సాగు చేస్తున్నారు. మా భూములన్నీ పోయేలా ప్రభుత్వం సర్వే చేస్తున్నది. భూమి లేకుండా మేం బతకలేం. ఎన్ని కష్టాలు ఎదురైనా భూమి ఇవ్వం.

-అనంతమ్మ, మహిళా రైతు, హకీంపేట, దుద్యాల మండలం

శివన్నగూడెం ప్రాజెక్టు కట్ట మీద ఆందోళన చేస్తున్న నర్సిరెడ్డిగూడెం ముంపు బాధితులు

న్యాయం జరిగే వరకు కదలం

మూడో రోజు పనుల అడ్డగింత.. శివన్నగూడెం ముంపు బాధితుల ఆందోళన

మర్రిగూడ, ఫిబ్రవరి 8: తమకు న్యాయం జరిగే వరకు కట్ట మీది నుంచి కదలబోమని నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల పరిధిలోని శివన్నగూడెం ప్రాజెక్టు ముంపు గ్రామమైన నర్సిరెడ్డిగూడెం భూనిర్వాసితులు తేల్చిచెప్పారు. మూడో రోజు శనివారం ఎక్కడికక్కడ టిప్పర్లను నిలిపివేసి ప్రాజెక్టు పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా 32 మంది నిర్వాసితులకు ప్లాట్లు, 15 మందికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. గ్రామంలో 289మంది నిర్వాసితులు ఉండగా.. 257 మందికి చింతపల్లిలో ప్లాట్లు కేటాయించారని తెలిపారు. ప్లాట్లు, ప్యాకేజీ ఇవ్వకుండా ఖాళీ చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లు ఒత్తిడి తెస్తున్నారని వాపోయారు. 10వ తేదీలోపు ఖాళీ చేసినవారికి కాంట్రాక్టర్‌తో మాట్లాడి రూ.20 వేల చొప్పున ఇప్పిస్తామని, ఆ తర్వాత తమకు సంబంధం లేదని అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

చావనైనా చస్తం..

మా గ్రామంలో ఇంకా 32 మందికి ప్లాట్లు, 15 మందికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రావాలి. ప్లాట్లు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తే గ్రామాన్ని విడిచిపెట్టిపోతం. అధికారులు, కాంట్రాక్టర్ మా పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నరు. మేం ఎంతకాడికైనా తెగిస్తం. నష్టపరిహారం అందేవరకు పనులు జరగనివ్వం. చావనైనా చస్తం కానీ, ఒత్తిళ్లకు మాత్రం లొంగం.

-మాదగోని సత్తయ్య, నర్సిరెడ్డిగూడెం నిర్వాసితుడు

మక్తల్ మండలం కాట్రేవుపల్లిలో సర్వేకు వెళ్లిన అధికారులతో వాగ్వాదానికి దిగిన రైతులు

ప్రాణాలు పోయినా భూములియ్యం

తేల్చిచెప్పిన మక్తల్ మండలం కాట్రేవుపల్లి రైతులు

మక్తల్, ఫిబ్రవరి 8 : 'మా ప్రాణాలైనా ఇస్తాం కానీ.. మా భూములను మాత్రం నారాయణపేట– కొడంగల్ ఎత్తిపోతల పథకానికి ఇచ్చేది లేదు' అని నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కాట్రేవుపల్లి రైతులు తేల్చిచెప్పారు. మక్తల్ మండలం భూత్పూర్ రిజర్వాయర్ నుంచి ఏడు టీఎంసీల నీటిని తరలించేందుకు నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మాణంలో భాగంగా శనివారం అధికారులు మక్తల్ మండలం కాట్రేవుపల్లికి భూముల సర్వే నిమిత్తం వచ్చారు. వ్యవసాయాన్ని నమ్ముకొని బతుకున్న తమ భూములు గుంజుకుంటే ఎట్లా అని రైతులు అధికారులను నిలదీశారు. భూములు ఇచ్చేది లేదని, సర్వే చేయొద్దని రైతులు మూకుమ్మడిగా అడ్డుకున్నారు. నోటీసులు, సమాచారం ఇవ్వకుండా సర్వే ఎలా చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మా భూములు మాకిచ్చేయండి

- పోలీసు వలయాన్ని ఛేదించుకొని ఫార్మా బాధిత రైతుల పోరాటం
- బారికేడ్లతో అడ్డుపడ్డ పోలీసులు
- కలెక్టరేట్‌లోకి అనుమతి నిరాకరణ.. గేటు వద్దే బైఠాయించిన అన్నదాతలు
- రైతులతోపాటు కాంగ్రెస్ నేతల ధర్నా

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఫార్మా బాధిత రైతులు. చిత్రంలో రైతులతో కలిసి నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు యాచారం మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, నానక్‌నగర్ మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్‌నేత అర్వింద్‌కుమార్ తదితరులు

రంగారెడ్డి, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం, పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించినా ఫార్మా వ్యతిరేక పోరాట సమితి రైతులు వెనకడుగు వేయలేదు. పోలీసు వలయాన్ని ఛేదించుకొని మరీ రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. 'మా భూములు మాకు వదిలేయండి' అంటూ నినదించారు. ఇచ్చినహామీని నిలబెట్టుకోకుండా కాంగ్రెస్‌సర్కారు తమను మోసం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అన్నదాతలు భారీగా కదలిరావడంతో స్థానిక కాంగ్రెస్‌నేతలు వారి అడుగులో అడుగువేయక తప్పలేదు. 'సీఎం డౌన్‌డౌన్' అంటూ నినదిస్తూ నిరసనలో వారూ పాల్గొనాల్సి వచ్చింది.

బారికేడ్లను దాటుకొని నిరసనలు

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలో ఫార్మా సిటీ కోసం భూములిచ్చిన రైతులు మరోసారి తమ ధిక్కార స్వరాన్ని వినిపించారు. ఫార్మాసిటీ కోసం ఇచ్చిన భూములను తిరిగి ఇచ్చేయాలంటూ కొంత కాలంగా రైతులు నిరసన తెలుపుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో భూసేకరణకు సంబంధించి అభ్యంతరాలను తెలపాలంటూ ఇటీవల రెవెన్యూ అధికారులు రైతులకు నోటీసులు జారీచేశారు. శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు కలెక్టర్‌తో సమావేశమయ్యేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు అందులో పేర్కొన్నారు. దీంతో శనివారం ఉదయం రైతులు పెద్దఎత్తున కొంగరకలాన్‌లోని కలెక్టరేట్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. తొలుత 250 మంది బాధిత రైతులు మేడిపల్లిలోని ఫార్మా వ్యతిరేక పోరాట సమితి స్థూపానికి పూలమాలలు వేసి, నల్ల జెండాను ఆవిష్కరించారు. ఫార్మాసిటిని రద్దు చేయాలని నినాదాలు చేశారు. రైతులు భారీఎత్తున వస్తున్నారన్న విషయం తెలుసుకున్న పోలీసులు యాచారం రహదారితో పాటు ఇబ్రహీంపట్నం వద్ద అడ్డుకునేందుకు సిద్ధమయ్యారు. సమాచారమందుకున్న రైతులు గ్రూపులుగా విడిపోయి గ్రామాల్లోని లింకు రోడ్ల ద్వారా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడ పోలీసులు అడ్డుకోవడంతో ప్రధానగేటు ముందు బైఠాయించారు.

నోటీసులిచ్చి.. వాయిదా వేసి

ఫార్మా బాధిత రైతులను శనివారం రావాల్సిందిగా అధికారులే నోటీసులు ఇవ్వగా.. తీరా సమయానికి కలెక్టర్ కార్యాలయానికి రాలేదు. పోలీసుల సూచనల మేరకు ఆయన సమావేశానికి దూరంగా ఉన్నారని సమాచారం. వందల మంది రైతులు వచ్చారని, వారంతా తాము భూములు ఇవ్వబోమని చెబితే సంచలనంగా మారుతుందని, లగచర్ల తరహాలో ఉద్రిక్తతకు దారితీసే అవకాశాలూ లేకపోలేదని పోలీసులు కలెక్టర్‌కుసూచించినట్టు తెలిసింది.

రేవంత్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతల నినాదాలు

ఫార్మాసిటీ భూములను తిరిగి రైతులకు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ మాట తప్పడంతో స్థానిక నాయకులు ఇరకాటంలో పడ్డారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమం అయినప్పటికీ యాచారం మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, నానక్‌నగర్ మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ ఎస్టీ మోర్చా నేత అర్వింద్‌కుమార్ తదితరులు ధర్నాలో పాల్గొనాల్సి వచ్చింది. సీఎంతో పాటు స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న రైతులతో గొంతు కలపాల్సి వచ్చింది.

తొలి గండం దాటితే 90 ఏండ్ల ఆయుష్షు

కాంగ్రెస్ ప్రభుత్వ భూ సేకరణ, కూల్చివేతలపై కేటీఆర్ మండిపాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం భూసేకరణ, కూల్చివేతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'తొలిగండం దాటితే 90 ఏండ్ల ఆయుష్షు' అన్నచందంగా కాంగ్రెస్ పాలన ఉందని విమర్శించారు. అల్లుడి కంపెనీలు, అదానీ పరిశ్రమలు, అన్నదమ్ముల ఆస్తుల పెంపు, ఢిల్లీకి మూటల చేరవేత కోసం రేవంత్‌రెడ్డి ఆరాటపడుతున్నారని ఎద్దేవా చేశారు. పేదల భూములు లాక్కునేందుకు కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న కుట్రలను ఎదుర్కొనిలాఠీ దెబ్బలు తిని, చేతులకు బేడీలు వేసుకుని, నెలల పాటు చెరసాలల పాలైనా భూములను చెరబట్టడంలో మాత్రం రేవంత్ ప్రభుత్వం పట్టు వదలడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పట్నంలో పేదల గూళ్లు, ఉపాధి కేంద్రాలు, పాలడబ్బాలు, చెప్పుల దుకాణాలు, పల్లెల్లో పేదల భూములు, గరీబోళ్ల ఇండ్లు, పంటపొలాలు, పచ్చని పైర్లలో రేవంత్‌రెడ్డి అధికారులు స్వైరవిహారం చేస్తున్నారని మండిపడ్డారు. పదేండ్లు ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో ఏడాదికాలంగా ఏం జరుగుతున్నదో తెలియని పరిస్థితి నెలకొన్నదని, కాంగ్రెస్‌పాలనతో రాష్ట్రంలో దినదినగండంలా మారిందని కేటీఆర్ పేర్కొన్నారు.

లోకం పోకడ

ఇక సీలింగ్ భూముల వంతు!

- ఇండస్ట్రియల్ పార్క్‌కు మరో 198 ఎకరాల సేకరణ
- మహేశ్వరం, నాగిరెడ్డిపల్లి భూములకు నోటిఫికేషన్
- సాగులో ఉన్న 131 మంది రైతుల్లో అధికులు దళితులు, గిరిజనులే

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): ఇండస్ట్రియల్ పార్క్ కోసం రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో 131 మంది రైతుల నుంచి 198.21 ఎకరాల సీలింగ్ భూములు సేకరించేందుకు ప్రభుత్వం శనివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ భూములను సాగుచేసుకుంటున్నవారిలో అత్యధికంగా దళితులు, గిరిజనులే ఉన్నారు. ప్రజలనుంచి వస్తున్న వ్యతిరేకతను పోలీసు బలగాలతో అణిచివేస్తూ ప్రభుత్వం భూసేకరణ సాగించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పారిశ్రామికవాడల ఏర్పాటు కోసం ఇప్పటికే వికారాబాద్ జిల్లా లగచర్ల, సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామాలు, రంగారెడ్డి జిల్లా తిమ్మాపూర్ తదితర ప్రాంతాల్లో భూసేకరణ నోటిఫికేషన్లు జారీ అయిన విషయం విదితమే. తాజాగా నాగిరెడ్డిపల్లిలో అధికంగా దళిత, గిరిజనుల సాగులో ఉన్న సీలింగ్ భూములను సేకరించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లా కలెక్టర్ కార్యాలయంతోపాటు కందుకూరు డివిజన్ కార్యాలయంలో భూమి ప్లాన్ ఉన్నట్టు, పనిదినాల్లోఎప్పుడైనా చూసుకోవచ్చని అధికారులు తెలిపారు. అధీకృత అధికారి, వారి సిబ్బంది ఎప్పుడైనా ఈ భూముల్లోకి వెళ్లి సర్వే చేసుకోవచ్చని, భూమిని చదును చేసుకోవడం, తవ్వకాలు జరపడం, బోర్లు వేయడం తదితర పనులు చేపట్టవచ్చని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. నోటిఫికేషన్ వెలువడిన తేదీ నుంచి ఇట్టి భూముల క్రయవిక్రయాలు కానీ, ఎటువంటి లావాదేవీలు కానీ జరపరాదని స్పష్టం చేశారు. నష్ట పరిహారానికి సంబంధించిన సమస్యలు, ఇతర అభ్యంతరాలుంటే 60 రోజుల్లోగా వాటిని జిల్లా కలెక్టర్, లేదా అధీకృత అధికారి సమక్షంలో నమోదు చేయవచ్చని వివరించారు. నోటిఫికేషన్ వర్తించే రైతుల్లో అధికంగా ఒక ఎకరం, అంతకన్నా తక్కువ విస్తీర్ణంగల కమతాలు ఉన్నవారే ఎక్కువగా ఉన్నారు. ఇప్పటికే ప్రభుత్వం లగచర్లతోపాటు వివిధ ప్రాంతాల్లో ఎక్కువగా అసైన్డ్ భూములనే సేకరిస్తుండటంపట్ల బాధిత దళిత, గిరిజన రైతుల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

అరకొర నష్టపరిహారంతో ఆగమవుతున్న రైతులు

బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలోని భూములకు దేశంలో ఎక్కడా లేనంతగా గిరాకీ ఏర్పడిన విషయం విదితమే. రాష్ట్రంలోని ఏ మూలకు వెళ్లినా ఎకరా ధర రూ.30 లక్షల నుంచి 50 లక్షలకు తక్కువ లేదు. దీంతో ఎకరా, రెండెకరాల భూమి ఉన్న చిన్న రైతులకు సైతం ఓ భరోసా ఏర్పడింది. పంటలు పండించుకొని బతకడంతోపాటు ఎప్పుడైనా అనుకోని కష్టమొస్తే ఆ భూములే తమని ఆదుకుంటాయనే విశ్వాసంతో వారు జీవిస్తున్నారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అరకొర నష్టపరిహారం చెల్లించి రైతుల భూములను సేకరించాలని ప్రయత్నించడం వారికి కంటిమీద కునుకులేకుండా చేస్తున్నది. ప్రభుత్వం బహిరంగ మార్కెట్ ధరను చెల్లిస్తే అదే డబ్బుతో తాము వేరే ప్రాంతంలో భూములు కొనుగోలు చేసుకుంటామని కొందరు రైతులు పేర్కొంటున్నారు. కానీ అరకొర నష్టపరిహారంతో తమ జీవితాలు రోడ్డున పడతాయని, హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకోవడం తప్ప వేరే ప్రత్యామ్నాయం ఉండదని వారు వాపోతున్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

- రాష్ట్రప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ) : రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి పంచాయతీలో ప్రభుత్వ భూమిని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సర్కారును హైకోర్టు ఆదేశించింది. మండల పంచాయతీ అధికారి, కార్యదర్శుల అక్రమాలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. రుద్రంగి పంచాయతీలోని ప్రభుత్వ భూమిలో ఇంటి నిర్మాణాలకు అనుమతిస్తున్నారంటూ 2014 డిసెంబరు 9న వినతిపత్రం ఇచ్చినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోలేదని గ్రామానికి చెందిన పీ నరేశ్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ రేణుకతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది తీగల రాంప్రసాద్ వాదనలు వినిపిస్తూ పంచాయతీ కార్యాలయంలో మండల పంచాయతీ అధికారి సుధాకర్, కార్యదర్శి రాందాస్ హన్లూ అక్రమాలకు పాల్పడుతున్నారని, ప్రభుత్వ భూమిలో ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారని, ఆర్థిక ప్రయోజనాలు పొందుతూ ఇంటి నంబర్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వ భూమిలోని అక్రమ నిర్మాణాలను తొలగించాలని సూచించారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ డివిజనల్ పంచాయతీ అధికారి దీనిపై విచారణ జరిపించి నివేదిక తెప్పించినట్టు తెలిపారు. నివేదిక ఆధారంగా పిటిషనర్ సమక్షంలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం అక్రమాలపై విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ విచారణను ముగించింది.